క్లుప్తంగా

రేపు హుండీ కానుకల లెక్కింపు

బొర్రగూడెం(మైలవరం):బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవాలయంలో స్వామివార్లకు హుండీల ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను ఈ నెల 28న ఉదయం 10 గంటలకు లెక్కిస్తారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. తేజ శనివారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో జరిగే కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, చైర్మన్ చెలికాని వెంకట సత్య వరప్రసాద్, దేవదాయ ధర్మాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు పర్యవేక్షిస్తారని చెప్పారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు విద్యార్థుల ఎంపిక

మైలవరం: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మైలవరం ఎస్ఎస్‌కే విద్యార్థులు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ గొల్లపూడి భావన శనివారం తెలిపారు. ఈనెల 25న జగ్గయ్యపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి బాలుర అథ్లెటిక్స్ పోటీల్లో 9వ తరగతి విద్యార్థి వింజమూరి అభిషేక్ హైజంప్, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానం, ట్రిపుల్ జంప్‌లో షేక్ వలి తృతీయ స్థానంలో నిలిచారన్నారు. వీరు నవంబర్ 2న రాష్ట్ర స్థాయిలో జరుగనున్న పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వీరిని పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి మోహనరావు, కరస్పాండెంట్ భావన, ఉపాధ్యాయులు అభినందించారు.

1,500 మందికి రక్త నమూనా పరీక్షలు



మైలవరం: ప్రతి ఒక్కరూ రక్త నమూనాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అప్పారావు అన్నారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్ సౌజన్యంతో రక్త నమూనా పరీక్షలు శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ రక్త నమూనాలపై అవగాహన పెంపొందించుకుని, ప్రమాదాలలో కాని, ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు కానీ ఇతరులకు సహాయం చేసేందుకు ముందుకు రావాలన్నారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండటానికి ఆస్కారం ఉందన్నారు. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు గుర్తింపు కార్డులు ఇస్తామని, కార్డులో అన్ని వివరాలు పొందపరుస్తామని చెప్పారు. గత రెండు రోజులుగా నిర్వహించిన కార్యక్రమంలో 1500 మందికి రక్త నమూనా పరీక్షలు నిర్వహించామన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి ఎస్. ఉమామహేశ్వరరెడ్డి, వివిధ విభాగాధిపతులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, ఆంధ్రా హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపల్లి ఖిల్లాపై స్వచ్ఛతాహీ సేవ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ఇండియా టూరిజం విజయవాడ వారి ఆధ్వర్యంలో కొండపల్లి ఖిల్లాపై స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం శనివారం నిర్వహించారు. విజయవాడ నలంద విద్యాలయానికి చెందిన యువ టూరిజం క్లబ్ సభ్యులు చరిత్రాత్మక కట్టడాల మధ్య పేరుకు పేయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి డంపింగ్ కేంద్రాలకు తరలించారు. క్లబ్ సభ్యులు మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 2 నుంచి 31వ తేదీ వరకు నగరంలోని వివిధ పర్యాటక ప్రాంతాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ముసునూరు: సారా విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడి నిర్వహించి మహిళను అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు. శనివారం చెక్కపల్లికి చెందిన తాళం భూలక్ష్మి సారా అమ్ముతుండగా అరెస్టు చేశారు.

పేకాట శిబిరంపై దాడి..

లోపూడిలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం ఎస్ఐ ఎం. చిరంజీవి సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.3,850 స్వాధీనం చేసుకున్నారు.

గురువులు ఇలా.. చదువులు ఎలా?

- విధులకు హాజరుకాని ఉపాధ్యాయులు
- ఐదుగురిలో ముగ్గురు వ్యక్తిగత సెలవులు
- ఒకరు ప్రభుత్వ ట్రైనింగ్‌కు హాజరు
- నాలుగు రోజులుగా ఒక్కరే టీచర్



కొత్త జూపూడి ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవుపై వెళ్లడంతో ఖాళీగా కూర్చున విద్యార్థులు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కొత్త జూపూడి ఎంపీపీ పాఠశాల ఉపాధ్యాయులు మూకుమ్మడి సెలవుల్లో ఉండటంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వారంతా ఆరోగ్యం బాగోలేదని సెలవులు తీసుకోవడంపై విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. 75 మంది విద్యార్థులకు ముగ్గురు ఉండాల్సిన పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులను నియమించడం వలనే ఆడింది ఆట పాడింది పాటలా వీరి వ్యవహారం సాగుతోంది. గతంలో పాఠశాలపై ఉన్న పర్యవేక్షణ ప్రస్తుతం లేకపోవడంతో టీచర్లు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తూ విద్యార్థులను చదువుకు దూరం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఎంఈఓ-2 రత్నశ్యాంబాబు శనివారం పాఠశాలను సందర్శించిన సమయంలో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మూకుమ్మడి సెలవులతో పర్యవేక్షణ కరువు

ఏడాదిన్నర కిందట ఎంపీపీ మోడల్ పాఠశాలలో 119 మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారు. ఈ ఏడాది 75 మంది పిల్లలకు ఐదుగురు టీచర్లు ఉండటం గమనార్హం. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఐదుగురిలో ఒకరు ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు ట్రైనింగ్‌కు వెళ్లారు. హెచ్ఎం శ్రీనివాసరావు అనారోగ్యంతో ఈనెల 23 నుంచి 26వ తేదీ వరకు సెలవు పెట్టారు. మరొకరు ఆమె కుమారుడిని విదేశాలకు పంపించేందుకు గురువారం నుంచి సెలవులో ఉన్నారు. ఇంకొకరు శుక్రవారం మధ్యాహ్నం నుంచి ఆరోగ్యం బాగోలేదని సెలవుపై వెళ్లిపోయారు. మిగిలిన ఒక్క టీచరే విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నుంచి సెలవుపై వెళ్లిన టీచర్ ఆరోగ్యం సరిగా లేనందున పాఠశాలకు వచ్చినా విశ్రాంతి తీసుకోవడంతో 1 నుంచి 5 తరగతులు ఒక్కరే చూడాల్సి వస్తోంది. విద్యార్థులపై పర్యవేక్షణ లేకపోవడంతో గడిచిన నాలుగు రోజులుగా మధ్యాహ్న భోజన సమయం వరకు ఉన్న విద్యార్థులు ఆ తర్వాత కొందరు ఇళ్లకు వెళ్లడంతో తల్లిదండ్రులు ఆరాతీసి ఉపాధ్యాయుల సెలవులపై అసహనం వ్యక్తం చేశారు.

సర్దుబాటుపై అధికారుల అలసత్వం

ఉపాధ్యాయులకు అప్పటి పరిస్థితులను బట్టి హెచ్ఎం సెలవు మంజూరు చేయవచ్చు. అయితే హెచ్ఎం సెలవుపై వెళ్లే సమయంలో మరొకరికి ఇన్‌చార్జి బాధ్యత అప్పగించాలి. ఇక్కడ ఎవరికీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించకుండా ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు సెలవుపై వెళ్లారు. సెలవులు మంజూరు చేసే సమయంలో ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సిన విద్యా శాఖాధికారులు నిబంధనలు పాటించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

వివాదాలతో నష్టపోతున్న విద్యార్థులు

ఇటీవలి కాలంలో ఉపాధ్యాయుల మధ్య వివాదాలు తలెత్తడంతో తల్లిదండ్రులు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అప్పటి నుంచి ఉపాధ్యాయులు చదువు చెప్పడం గాలికొదిలేసి ఒకరిపై ఒకరు పగ, ప్రతీకారం తీర్చుకోవడంతో కాలం వెల్లదీస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



కబుర్లు, కాలక్షేపంతోనే సరి

పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య ఆధిపత్య పోరు నడుస్తోంది. టీచర్లు రెండు వర్గాలుగా విడిపోయారు. ప్రభుత్వ పాఠశాలల్లో మంచి చదువు ఉంటుందనే పదానికి అర్థం మార్చేశారు. వచ్చినప్పటి నుంచి కబుర్లు, కాలక్షేపాలతో గడిపేస్తున్నారు. ఇద్దరు బిడ్డలు ఇక్కడే చదువుతున్నారు. చదువు సక్రమంగా సాగడంలేదు.

– రెంటపల్లి నాగబాబు, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్



సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

ఉపాధ్యాయుల మధ్య సమన్వయం కొరవడింది. ఏడాదిలో మిగిలిన సెలవులు నవంబర్, డిసెంబర్‌లోనే వినియోగించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో వారికున్న సెలవులు పెట్టుకుంటున్నారు. ఒక్కరే టీచర్ ఉన్నట్లు నా దృష్టికి వచ్చింది. విద్యార్థుల చదువును దృష్టిలో పెట్టుకుని వెంటనే హెచ్ఎంను మధ్యాహ్నం పంపించాను. సమావేశం నిర్వహించి ఉపాధ్యాయుల మధ్య సమన్వయం కోసం కృషి చేస్తా.

– సీహెచ్ పుష్పలత, ఎంఈఓ, ఇబ్రహీంపట్నం

గర్భకోశ వ్యాధుల నివారణకు జాగ్రత్తలు అవసరం

వావిలాల పశు వైద్యాధికారి శ్వేత

తిరువూరు: పాడి పశువుల్లో గర్భకోశ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వావిలాల పశు వైద్యాధికారి టి. శ్వేత అన్నారు. కోకిలంపాడులో శనివారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సా శిబిరం నిర్వహించారు. గేదెలు గర్భం దాల్చని సమయంలో తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించాలని కోరారు. చలికాలంలో పశువులు ఎదకు వచ్చే సమయంలో కట్టు నిలవకపోవడంతో దీర్ఘకాలికంగా చూడికి దూరంగా ఉంటాయని, పరీక్షలు నిర్వహించి ఉచితంగా అవసరమైన మందులు అందించడంతో పాటు మేలు జాతి ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయిస్తామన్నారు. చింతలపాడు, గన్నవరం అసిస్టెంట్ వెటర్నరీ సర్జన్లు హరిత, స్వప్న, వీఎల్‌ఓ గోపాలకృష్ణ, వీహెచ్ఏలు నాగేంద్రబాబు, జయసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

తహసీల్దార్ లక్ష్మీకల్యాణి



విస్సన్నపేట: దీపావళి సందర్భంగా విస్సన్నపేటలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసేవారు తగిన జాగ్రత్తలు, నిబంధనలు పాటించాలని తహసీల్దార్ కె. లక్ష్మీకల్యాణి అన్నారు. బాణసంచా దుకాణాల ఏర్పాటుకు సంబంధించి స్థానిక పాత మిల్లు ఆవరణ స్థలాన్ని సంబంధిత అధికారులతో కలిసి తహసీల్దార్ శనివారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ షాపునకు, షాపునకు మధ్య దూరం ఉండేలా చూసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం బాణసంచా విక్రయాలు చేయాలన్నారు. ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎస్ఐ జి. రామకృష్ణ, విద్యుత్ ఏఈ విజయ భాస్కర్, అగ్నిమాపక అధికారి భరత్‌భూషణ్ పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి

ఆగిరిపల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలని ఎంపీపీ గోళ్ల అనూష అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు అభివృద్ధి నివేదికను వివరించారు. ఎంపీపీ మాట్లాడుతూ అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధిలో ముందంజలో ఉంచేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ బి.భార్గవి, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఈఓపీఆర్డీ ఆనంద్ బాబు, ఏఓ అబ్దుల్ సలాం, వైద్యాధికారి జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు.

90 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం

నూజివీడు: నూజివీడు మండలంలో ఈ ఆర్థిక సంవత్సరంలో 2 వేల ఎకరాల్లో డ్రిప్ సేద్యాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని ఉద్యాన అధికారి ఆర్.హేమ తెలిపారు. డ్రిప్ అవసరం ఉన్న ప్రతి రైతుకు ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. చిన్న, సన్నకారు రైతులకు బిందుసేద్యం పరికరాల ఏర్పాటుకు 90 శాతం రాయితీ, ఐదెకరాలు పైబడిన రైతులకు 50 శాతం రాయితీతో డ్రిప్ ఏర్పాటు చేస్తామని వివరించారు.

పెన్నులు, పెన్సిళ్లు అందజేత

మైలవరం: మైలవరం శ్రీ లీలావతి గిరిజన పాఠశాల విద్యార్థులకు గ్రామానికి చెందిన యరమల శ్రీనివాసరెడ్డి, జ్యోతి దంపతులు శనివారం పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉడతా లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

దళితుల ఆందోళన

నూజివీడు: సస్పెండ్ అయిన యూనియన్ బ్యాంకు మేనేజర్ చేతిలో మోసపోయిన పలువురు దళితులు, వారికి మద్దతుగా దళిత సంఘాల నాయకులు కలిసి న్యాయం చేయాలంటూ మండలంలోని సీతారామపురంలో శనివారం సాయంత్రం ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ బ్యాంకులో కుదవ పెట్టిన బంగారం తక్కువ రేటుకి ఇప్పిస్తానంటూ కలపాల వరలక్ష్మి దగ్గర రూ.1.50 లక్షలు, త్రికాకొల్లి భువనేశ్వరి వద్ద రూ.3 లక్షలు తీసుకొని మోసం చేశారని వాపోయారు. కేసులు కట్టినప్పటికీ డబ్బులు రికవరీ రాకపోగా దళితులైన తమను అవమానిస్తూ మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభావతికి మద్దతుగా మాట్లాడుతున్న జనసేన నాయకురాలు రావి సౌజన్య తమ ఊరొచ్చి వాస్తవాలు తెలుసుకొని ఆ తరువాత మాట్లాడాలన్నారు. బాధిత మహిళలకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని దళిత సంఘాల నాయకులు హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్మీ వేడుకలు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రామంలో గ్యార్మీ వేడుకలను శనివారం ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మజిత్ అల్లాహు అక్బర్ మసీదులో మత గురువు షేక్ రహ్మతుల్లా ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. గౌసే ఆజం చిహ్నంగా షరీఫ్ జెండా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివారం మసీదు వద్ద భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని మసీదు కమిటీ సభ్యులు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ



నూజివీడు: కృష్ణా విశ్వవిద్యాలయం అంతర్ కళాశాలల బాస్కెట్ బాల్ పోటీలు నూజివీడులోని ధర్మ అప్పారావు (డీఏఆర్) కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో 8 జట్లు పాల్గొనగా నూజివీడుకు చెందిన సిద్ధార్థ డిగ్రీ కళాశాల జట్టు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచింది. కళాశాల విద్యార్థులు ఎ. సాయిరామ్, ఎ. తేజ, ఎల్. అర్జున్, ఎండీ మస్తాన్ బెంగళూరులో నిర్వహించనున్న సౌత్‌జోన్ యూనివర్సిటీ బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణా యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతిభ చూపిన జట్టును డీఏఆర్ కళాశాల ఏఓ దీప్తి, సిద్ధార్థ విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, కోచ్ వాకా నాగరాజు, ప్రిన్సిపాల్ ఎండీ ఇద్రీస్ అభినందించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ముసునూరు: చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అల్లోపతి, ఆయుర్వేద, హోమియోపతి, ఫిజియోథెరపీ, మానసిక వైద్య నిపుణులు పాల్గొని వైద్య సేవలు అందిస్తారు.

గ్రామాల సరిహద్దులు రీసర్వే చేయాలని వినతి

రాయనపాడు(విజయవాడరూరల్):రాయనపాడు–పైడూరుపాడు గ్రామాల మధ్య సరిహద్దులను రీ సర్వే చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన రైతు వేముల రంగారావు అర్జీ అందజేశారు. శనివారం రాయనపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద రీ సర్వే గ్రామ సభ జరిగింది. పలువురు రైతులు పాల్గొని రీ సర్వేలో అభ్యంతరాలను మండల సర్వేయర్ ఎస్.జనార్దనరావుకు తెలిపారు.

చంద్రాల(మైలవరం): గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి అన్నారు. చంద్రాల గ్రామంలో శనివారం గ్రామ సభ జరిగింది. సభకు రైతుల నుంచి 56 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ జె.జ్యోతి, మాజీ ఎంపీపీ జొన్నలగడ్డ గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసులను నీరుగారిస్తే ఊరుకోం

ముసునూరు: ఎస్సీ, ఎస్టీ కేసులను పోలీసులు నీరుగారుస్తున్నారని, అలా చేస్తే ఊరుకోబోమని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి.హరనాథ్ అన్నారు. శనివారం ఆయన ముసునూరులో విలేకరులతో మాట్లాడుతూ ముసునూరులో ఓ దళితుడికి చెందిన భూమిని బీసీ వర్గానికి చెందిన వ్యక్తి అన్యాక్రాంతం చేస్తే.. అడ్డుకున్నందుకు ఆ దళితుడిని కులం పేరుతో దూషించి, దౌర్జన్యం చేశారన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి 10 నెలలు గడుస్తున్నా కేసు నమోదు చేయలేదని చెప్పారు. బాధితుడే స్వయంగా కలిసి, జరిగిన ఘటనను వివరించి న్యాయం కోరినా పట్టించుకోలేదన్నారు.

తెలంగాణ మద్యం స్వాధీనం

జి.కొండూరు(మైలవరం): మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామంలో గత రాత్రి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు జరిపిన దాడుల్లో జి.కొండూరు గ్రామానికి చెందిన పజ్జూరు గోపీని అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న ఆరు తెలంగాణ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేశారు.

రద్దీ ప్రాంతంలో విగ్రహాలా?



అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ సత్యనారాయణ

నూజివీడు: ఎలాంటి అనుమతులు లేకుండా రద్దీగా ఉండే బస్టాండ్ సెంటర్‌లో గౌతు లచ్చన్న విగ్రహానికి పిల్లర్ నిర్మిస్తుంటే మున్సిపల్ అధికారులు ఏమి చేస్తున్నారని కౌన్సిలర్ పగడాల సత్యనారాయణ మున్సిపల్ అధికారులను నిలదీశారు. మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పగడాల మాట్లాడుతూ పట్టణంలోని ఖాళీ స్థలాల్లో పిచ్చిచెట్లు పెరిగిపోతే ఎందుకు తొలగించడం లేదన్నారు. 8వ వార్డు కౌన్సిలర్ చెరుకూరి దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలో కోతులు, కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. కమిషనర్ వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ 28 తేదీ నుంచి కోతులు పట్టిస్తామన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బీ రోడ్ల దుస్థితి దారుణంగా ఉందని, సమావేశానికి ఆర్అండ్‌బీ అధికారులు ఎందుకు రాలేదని దుర్గాప్రసాద్ ప్రశ్నించారు. 32వ వార్డు కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ పెద్దచెరువుకు గండి పడి 25 కుటుంబాలు సర్వం కోల్పోతే ప్రభుత్వ నుంచి సాయం రాలేదన్నారు. 16వ వార్డు కౌన్సిలర్ శీలం రాము మాట్లాడుతూ కాపు కల్యాణ మండపానికి స్థలం ఎంపిక చేయకుండా, ప్లాను పెట్టకుండా పర్మిషన్ కోసం పెట్టడమేమిటని ప్రశ్నించారు. వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కో–ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, లాం ప్రసాదరావు, షేక్ మెహబూబ్‌బీ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

క్వారీల పరిశీలన

విజయవాడరూరల్: రాజధాని ప్రాంతంలోని ప్రభుత్వ లేఅవుట్ల స్థలాలను మెరక చేసేందుకు అవసరమైన రబ్బీషు క్వారీలను సీఆర్‌డీఏ, మైనింగ్ అధికారులు శనివారం పరిశీలించారు. కొత్తూరు తాడేపల్లి గ్రామంలోని వసంత రాయుడి తిప్ప, జంట తిప్ప, వేమవరం గ్రామంలోని కొండ ప్రాంతాన్ని పరిశీలించారు. తొలుత పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లోని ప్రభుత్వ రెవెన్యూ పోరంబోకులోని క్వారీలకు ఉపయోగపడే వాటిని పరిశీలించారు. విజయవాడ రూరల్ మండల సర్వేయర్ ఎస్.జనార్దనరావు, వీఆర్వోలు చక్రధర్, కృష్ణ పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోవాలి



ఓటర్లకు నమోదు పత్రాలు అందజేస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): పట్టభద్రులు ఓట్లు నమోదు చేసుకోవాలని కొండపల్లి మున్సిపల్ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ షీనాబేగం అన్నారు. స్థానిక బ్యాంక్ సెంటర్‌లో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం ఆమె ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. పలువురు డిగ్రీ పూర్తి చేసిన వారిని ఓటర్లుగా నమోదు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కార్యదర్శి మిక్కిలి శరభయ్య, జిల్లా కార్యదర్శి పచ్చిగోళ్ల పండు మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన వారు నవంబర్ 6వ తేదీలోగా ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు కావాలన్నారు. గతంలో ఎమ్మెల్సీ ఓటు ఉన్న వారు సైతం నూతన ఓటుకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సర్టిఫికెట్లతో శిబిరం వద్దకు వస్తే తామే ఓటు నమోదు చేస్తామని చెప్పారు. 28వ వార్డు కౌన్సిలర్ బాడిశ నాగరాజుకుమారి, బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల రాజేష్, నాయకులు ఎంఏ బేగ్, షేక్ బుడే, చందా చంటి, జేమ్స్ షేక్ సలీం, మల్లికార్జున్, సందిపాము రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని మైలవరం తహసీల్దార్ జి. బాలకృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఓటరుగా నమోదు కోసం ఫారం 18తో పాటు వారి విద్యార్హత పత్రాల నకలు కాపీలను గజిటెడ్ అధికారితో సంతకం చేయించి ఓటరు నమోదు అధికారి, రెవెన్యూ అధికారి, సహాయ ఓటరు నమోదు అధికారి, మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, మున్సిపల్ కమిషనర్, కొండపల్లికి సమర్పించాలన్నారు. లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.